

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి - పెదబయలు :స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం అటవీ శాఖ రేంజ్ కార్యాలయం నుండి పర్యావరణంపై అవగాహనా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా మొక్కలు నాటాలని, చెట్లను పెంచాలని, ప్లాస్టిక్ వాడకం నిరోదించాలని నినాదాలు చేసారు ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

నాడు నేడు పనులు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : మన బడి నాడు నేడు కింద పాఠశాలల్లో చేపడుతున్న అబివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, ఎం.ఇ ఓలు, ఎటిడబ్ల్యూఓలు, వెలుగు ఎపిఎంలతో గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలల్లో నిర్మాణపు పనులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల పనులు, వంట గదుల మరమ్మతులు పనులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి వేగంగా "పూర్తి చేయాలని స్పష్టం చేసారు. సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ ద్వారా సరఫరా చేస్తున్న సామగ్రిపై ఆరా తీసారు. పాఠశాలలకు రివాల్వింగ్ ఫండ్ ఎంత వచ్చింది అడిగి తెలుసు కున్నారు. పాఠశాలల్లో మరమ్మతులకు అవసరమైన సిమెంటును స్థానికంగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రత్యేకాధికారులకు కేటాయించిన పాఠశాలలను తనిఖీ చేసి మన బడి నాడు నేడు పనుల నాణ్యతలు, నిర్మాణ సామగ్రి నాణ్యతలు, రిజిస్టర్ల నిర్వహణ పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లాలో డ్రాపౌట్లు లేకుండా నూరు శాతం పిల్లలు పాఠశాలలో ఉండే విధంగా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఎంపిడిఓలు, ఎ.ఇ.ఓలు, ఎటిడబ్ల్యూ ఓలు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరుకులు పంపిణీ కాంట్రాక్టర్లు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పాత టెండర్లు రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరే, డిఇఓ సలీం భాషా, ఐసిడి ఎస్ పి డి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యువత క్రీడల్లో రాణించాలి

జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి వేణుగోపాలరావు

ప్రజాశక్తి-అనంతగిరి:మన్యంలో యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు బానిస కాకుండా ఉండేందుకుగాను పోలీస్ శాఖ వారిని ప్రోత్సహించే విధంగా చర్యలు చేపడుతుందని అల్లూరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి వేణుగోపాలరావు పేర్కొన్నారు. గురువారం రాయల్ రిసార్ట్ ఆవరణలో నూతన సూర్యవాణి క్రికెట్ కల్చరల్ అకాడమీ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్ని. మాట్లాడుతూ, క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఎస్పి సిన్హా ఆధ్వర్యంలో తమ వంతు సహకారాన్ని అకాడమీకి అందిస్తామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ. గంగరాజు మాట్లాడుతూ, క్రీడల్లో రాణించాలని అకాడమీ నెలకొల్పడం చాలా ఆనందదాయకమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. అకాడమీని పటిష్ట పరిచేందుకు తమ ప్రోత్సాహాన్ని ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. ఎంపిపి శెటి నీలవేణి మాట్లాడుతూ యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు టీ షర్ట్ లను పంపిణీ చేశారు. అతిథిలకు అకాడమీ ప్రతినిధులు సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మువ. రూతు, నాగులు, అకాడమీ అధ్యక్షులు కమిడి రాజ్ కుమార్, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కమిటీ బందం సత్యా, రఘు ,స్వామి ,చందు పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో నీటి నిల్వల వినియోగంపై ఇరు రాష్ట్ర అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒడిశా మల్కనగిరి జిల్లా చిత్రకొండ ఓహెచ్‌పిసి కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. 2022 -23 నీటి సంవత్సరంలో ఏయే రాష్ట్రం బలిమెల జలాశయం నుంచి ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కలు తేల్చారు. ఆంధ్ర తన వాటాగా 50.7236 టీఎంసీలు నీటిని, ఒడిశా 38.6593 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు తేల్చారు. దీని ప్రకారం ఒడిశా కంటే ఆంధ్ర కంటే 12.0643 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ రెండు జలాశయాల్లో 24.6270 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నట్లు లెక్కించారు. ఆంధ్ర వాటా 6.2817 కాగా, ఒడిశా వాటా 8.3459 టీఎంసీలుగా పంపకాలు చేశారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాలు నీటి అవసరాలు నిమిత్తం 2000 క్యూసెక్కులు చొప్పున వినియోగించుకోవటానికి అధికారుల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో ఒడిశా తరుపున చీఫ్ కన్స్ట్రక్షన్ మేనేజర్ చంద్రశేఖర్ మిశ్రా, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ సివిల్ రమాకాంత్, పాత్ర టెక్నికల్ వింగ్ డిప్యూటీ మేనేజర్ కృప సింధు బిశ్వాల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మా శంకర్ సాహెూ, అసిస్టెంట్ ఇంజనీర్ గడాదర్ ప్రధాన్, ఆంధ్ర తరపున సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ జి.ప్రభాకర్, ఏఈ సిహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై

మండల సమావేశంలో సభ్యుల గళం



అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపిపి 1 సత్యనారాయణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీ వేడీగా సాగింది. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపీపీ1 పాటు భోయి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థల ఉపాధ్యాయులు విద్యాబోధన సక్రమంగా అందించ లేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారో అదే పాఠశాలలో వారి పిల్లలను చదివించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఆరు పాఠశాలలకు భవనాలు లేవని, వాటిని వెంటనే పున:ప్రారంభం చేయాలని డిమాండ్ చేశారు.
లక్ష్మీపురం సర్పంచ్ కోర్ర త్రినాథ్, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, వనబసింగి సర్పంచ్ లక్ష్మణ్ లు మాట్లాడుతూ, వైద్య శాఖలో పూర్తిస్థాయిలో మందులు ఉండ లేదని, వైద్య సిబ్బంది కొరతతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించలేకపోతున్నారని తెలిపారు.మెడికల్ మెయింటినెన్స్ చార్జీలు ఎప్పటికప్పుడు కమిటీ ద్వారా నివేదిక చూపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఒక విడతకు ఎంత గ్రాంటు వస్తుందో హెల్త్ చైర్మన్‌తో పాటు సభ్యులకు తెలియపరచి చర్చ జరపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్ల, స్టాఫ్ నర్సుల కొరత ఉందని పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకాలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.
తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, గ్రావిటీలు, జలజీవన్ మిషన్ స్కీం నిర్మాణాలలో జాప్యం జరుగుతోందని స్థానిక సర్పంచ్ సుభాష్ చంద్ర తెలిపారు.

గిరిజన సంఘం నిరసన

సంతబైలు వీధిలో తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని గిరిజన సంఘం, గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం మందిరం వద్ద నిరసన చేపట్టారు. అధికారులు సమాధానం చెప్పాలని మందిర ఆవరణలో బైఠాయించారు. ఆర్డబ్ల్యూఎస్ జేఈ రాతపూర్వక హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

మాకవర గ్రామ సమీపంలో నల్లరాయి క్వారీ తక్షణమే తొలగించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు జనరల్ బాడీ సమావేశం మందిరం వద్ద వినతి పత్రాన్ని ఇచ్చారు. వ్యవసాయ భూములు, పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టం, ఒక కుటుంబానికి రెండు లక్షలు చెల్లించాల్నఇ నాయకులు తెలిపారు. , క్వారీలో కూలీ చేస్తూ మతి చెందిన క్వారీ కార్మికుల ఒక్కొక్క కుటుంబనికి 20 లక్షల యాక్సిగ్రేషియా తక్షణమే చెల్లించాలని తహసిల్దార్ నర్సమ్మకు వినతి ఇచ్చారు. బినామీ పేరున నడుపుతున్న నల్ల రాయి క్వారీని తక్షణమే మూసివేసి బినామీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. బినామీగా ఉన్న వ్యక్తిని చట్టపరమైన చర్యలకు (శిక్ష) అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతం నుండి వచ్చి నల్లరాయి కోరిని నిర్వాసిస్తున్న హనుమంతరావును చీటింగ్ కేసు, నమోదు చేసి తక్షణమే రిమాండ్ కు తరలించాలని కోరారు.
బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తే ఊరుకోమంటూ మండల సర్పంచులు, ఎంపీటీసీలు వినతి పత్రాన్ని స్థానిక ఎంపీడీవోకు అందజేశారు. వైసిపి మండల అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో చేర్పిస్తే మండలంలో ఉన్న సర్పంచ్, ఎంపీటీసీలు పదవులకు రాజీనామా చేసి గిరిజనుల హక్కుల చట్టాలను కాపాడుకోవడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం అన్ని శాఖల వారీగా సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు

29 నుంచి ఎటపాకలో పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఎటపాక

పాలీసెట్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 29 నుండి జరిగే సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు ఎటపాక ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జె రామ్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజు ఒబిసి విద్యార్థులు రూ.700, ఎస్సి, ఎస్‌టి విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ polycetap.nic.inలో చెల్లించి రసీదు తీసుకొని కౌన్సెలింగ్‌కు రావాలని కోరారు. ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలీసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మెమో, 4నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఓసీ అభ్యర్థులు ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, టీసీ సర్టిఫికెట్ ఒరిజినల్ పత్రాలతో 3 సెట్‌ల జెరాక్స్ కాపీలు తీసుకొని రావాలని సూచించారు. ఈ నెల 29న 1 నుండి 12వేల ర్యాంక్ వరకు, 30న 12001 నుండి 28వేల వరకు, 31న 28001 నుండి 43వేల వరకు, జూన్ 1న 43001 నుండి 58వేల వరకు, 2న 58001 నుండి 74వేల వరకు, 3న 74001 నుండి 91వేల వరకు, 4న 91001 నుండి లక్ష 8వేల వరకు, 5న 108001 నుండి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుందని పేర్కొన్నారు. జూన్ 1 నుండి 6వరకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవాలని, 9న సీట్ ఆలాట్మెంట్ జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాల విద్యార్థులు వినియోగించు కోవాలని సూచించారు. ఎటపాక పాలిటెక్నిక్ కళాశాలలో గత సంవత్సరం నుండి బాల బాలికలకు విడి విడిగా హాస్టల్ వసతి కల్పించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

అమృతధార జలపాతం వద్ద

పర్యాటకుల సందర్శన నిలిపివేత

ప్రజాశక్తి మారేడుమిల్లి

మండలంలోని ప్రముఖ్య పర్యాటక ప్రదేశమైన అమృతధార జలపాతం సందర్శనను తాత్కలికంగా మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ రెంజ్ అధికారి ఎం.కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అమృతధార జలపాతం వద్ద విహారయాత్రకు వచ్చిన పర్యాటకురాలిపై చెట్టు కొమ్మ పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రంపచోడవరం డిఎఫ్ఓ జి.నరేంద్రన్ ఆదేశాల మేరకు అమృతధార జలపాతం వద్ద మెరుగైన భద్రతపరమైన రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జలపాతం వద్ద ఉన్న భారీ వృక్షాల కొమ్మలు, ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లు తొలగించడం వంటి పనుల నిమిత్తం పర్యాటకుల సందర్శనను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం పర్యాటకుల సందర్శన ఎప్పుడు అన్నది మరల తెలియజేస్తామని తెలిపారు.

రైతు భరోసా అందని వారు సచివాలయంలో సంప్రదించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఆర్ఓఎఫ్ఆర్ పట్టా గిరిభూమి పోర్టల్‌లో నమోదుకాక ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమకాని రైతులు గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖాధికారి రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదానికి సంబంధించిన మ్యాప్, ఆధార్ జెరాక్స్, బ్యాంకు అకౌంట్ జెరాక్స్, ఫోన్ నెంబర్‌తో సచివాలయానికి వెళ్లాలని కోరారు.

రామారావుకు ఎస్ఐ షరీఫ్ పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో జడ్డంగి ఎస్సై షరీఫ్ గురువారం పరామర్శించారు. గురువారం తీవ్ర నడుము నొప్పితో బాధపడుతున్న రామారావును కుటుంబీకులు గురువారం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిహెచ్సి వైద్యాధికారి సుజీ ప్రథమ చికిత్స నిర్వహించారు. రామారావు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ షరీఫ్, పోలీస్ సిబ్బంది ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును పరామర్శిస్తున్న ఎస్ఐ తదితరులు

పిడుగుపడి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ గాలి వానకు కురిసిన వర్షం కారణంగా పిడుగుపాటుకు గురై ఓ గిరిజనుడు మృతి చెందాడు.మండలంలోని గుమ్మకోట పంచాయతీ గ్రామానికి చెందిన కొర్రా. రాము (50) వర్షం కారణంగా చెట్టు కిందకు చేరాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.రాము ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. గుమ్మకోట పాఠశాల సమీపం రోడ్డు పక్కన మృతదేహమై పడి ఉండడంతో కుటుంబ సభ్యులు గుర్తించారు.

కెజిబివిలకు సరుకుల సరఫరా టెండర్లు ఖరారు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ ఫరిధిలో 11 కెజిబివిలకు అవసరమైన సరకుల సరఫరాకు పిలిచిన టెండర్ల ప్రక్రియ జిల్లా కలక్టర్, ఎపిఎస్ఎస్ చైర్మన్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కలక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ టెండర్ల ప్రక్రియలో దరఖాస్తు చేసిన పది మంది టెండర్ దారులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులైన జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా, విద్యా శాఖ పరిపాలనాధికారి సి.హెచ్ రామారావు, టెండర్ దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు ఓపెన్ చేసారు. టెండర్లను పరిశీలించిన కమిటీ రెండు టెండర్లను వివిధ కారణాలతో తిరస్కరించింది. కెజిబివిలకు సరఫరా చేయవలసిన సామగ్రి సరఫరాకు టెండర్ దారులు కోట్ చేసిన ధరలను ప్రస్తుత మార్కెట్ ధరలతో పరిశీలించి కమిటీ నిర్ణయం తీసుకుంటుందని కలక్టర్ స్పష్టం చేసారు. కమిటీ నిర్ణయం మేరకు తదుపరి సమావేశంలో సరఫరా చేసే బ్రాండులు ధరలు, ఐటంలు పరిశీలించి తుది నిర్ణయం శనివారం జరుగనున్న సమావేశంలో తీసుకుని వారికి కేజిబివిలను కేటాయించటం జరుగుతుందన్నారు. కమిటీ నిర్ణయం మేరకు మూడు నెలల పాటు సరఫరాను పరిశీలించి అవసరమైతే వారిని కొనసాగించుటకు లేదా కొత్త వారికి కేటాయించుటకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన ఐటంలను ఆయా టెండర్ దారులు కెజిబివిలకు సరఫరా చేయాలని, చూపించిన నాణ్యతల మేరకు రాజీ పడకుండా సరుకులు సరఫరా చేయాలని కలక్టర్ ఆదేశించారు. నిభందలు ఉల్లంఘిస్తే టెండర్‌ను రద్దు చేయటం జరుగుతుందని హెచ్చరించారు.

క్రీడలతో ఉల్లాసం

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయని స్థానిక గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత చెప్పారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిన్నారులకు గురువారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా చిన్నారులు రాణించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కే.సుబ్బారావు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



ఆడుతున్న చిన్నారులు

డైట్-3 గ్రామంలో విషాదఛాయలు

- బలిమెల రిజర్వాయర్‌లో నాటుపడవ బోల్తా పడి ఒకరు మృతి
- సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు
- ఈదురుగాలలు, భారీ వర్షమే కారణం



- రిజర్వాయర్ ఒడ్డును నిరీక్షిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు
- జలాశయంలో గాలించి మృతదేహాన్ని బయటకు తీస్తున్న రెస్క్యూ టీమ్



ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దులోని బలిమెల జలాశయంలో చేపల వేటకు వెళ్లిన నాటు పడవ బోల్తా పడి ఒకరు మృతి చెందడంతో డైట్-3 గ్రామంలో విషాదం నెలకొంది. ఒడిశాలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి డైక్-3 గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు నాటు పడవలో గురువారం ఉదయం చేపలు వేటకు వెళ్లారు. చేపల వేట అనంతరం తిరిగి ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు కారణంగా పడవను అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పడవ అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న ముగ్గురు నీట మనిగారు. వారిలో హరి, కైలాస్ ఇద్దరు ఈత కొట్టుకుంటూ ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. మరో వ్యక్తి గ్రే నదిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న చిత్రకొండ పోలీసులు వారి బలగాలతో రంగంలో దిగి రిస్కీ బోట్లతో బలిమెల జలాశయంలోని సంఘటన ప్రదేశానికి చుట్టు పక్కల గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు గ్రే మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

బలిమెల జలాశయంలో చేపల వేటకు వెళ్లిన పడవ బోల్తా పడిందన్న సమాచారం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు బంధువులు నది ఒడ్డుకు చేరుకొని బోరును విలపించారు. వీరిలో ఇద్దరు సురక్షితంగా ఇద్దరు సురక్షితంగా బయటపడడంతో వారి బంధువులు కొంత ఊపిరి పీల్చుకున్నా, తోటి వ్యక్తి మృతి చెందడంతో డైట్-3 గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రే కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని కటఫ్ ఏరియాకు చెందిన ఇద్దరు గిరిజనులు గత నెలలో బలమెల రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లి పదవ బోల్తా పడి మృతి చెందారు. గతంలోనూ అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి.

హంతకునికి అధికారులు కొమ్ముకాయడం సరికాదు

సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

తన మాజీ డ్రైవర్, దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుని ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబుకు ప్రభుత్వ అధికారులు కొమ్ముకాయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అన్నారు. మండల కేంద్రం రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రిమాండ్ నుండి షరతులతో కూడిన బెయిల్‌పై వచ్చిన వ్యక్తి బహిరంగ సభకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. గిరిజనులు చిన్న చిన్న సమావేశాలు నిర్వహించుకునే క్రమంలో ఎన్నో ఆంక్షలు పెట్టి అధికారులు ఇలా హంతకుడికి అనుమతి ఇచ్చి ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారన్నారు. అనంతబాబు బహిరంగ సభకు సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల ద్వారా జన సమీకరణ చేయడం ప్రజాస్వామ్యం ఖూనీ చేయడమే అవుతుందన్నారు. బోయ వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై ఆందోళన చేస్తున్న గిరిజనులను తప్పు దోవ పట్టించడానికే ప్రభుత్వం అనంతబాబు చేత బహిరంగ సభ నిర్వహించిందని విమర్శించారు. అమాయక ఆదివాసీలు, దళితులపై దాడులకు పాల్పడే, హత్యలు చేసే వారికి ఊరేగింపులు, సన్మానాలు చేయటం, వత్తాసు పలకటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఆధికార పార్టీలో రోజు రోజుకు అభద్రతాభావం పెరుగుతోందన్నారు. కమ్యూనిస్టులు అసెంబ్లీలో అడుగు పెడితే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గంలో కమ్యూనిస్టు జెండా ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్లది రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

రోడ్ల విస్తరణకు శ్రీకారం

రహదారికిరువైపులా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో మెయిన్ రోడ్ విస్తరణ పై అధికారులు దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు పాడేరులో మూడు రోడ్ల కూడలి అంబేద్కర్ సెంటర్ నుంచి రోడ్డు కిరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు కార్యక్రమానికి అధికార యంత్రాంగం గురువారం శ్రీకారం చుట్టింది. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, ఆర్ అండ్ బి, శాఖల అధికారులు మంది మార్బలంతో ప్రొక్లెయిన్ ఉపయోగించి ఆక్రమణలు తొలగింపు పనులు ప్రారంభించారు. పాడేరు జిల్లా కేంద్రం అయిన తర్వాత ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు భారీ సంఖ్యలో తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువయింది. జిల్లా కేంద్రమైన తరువాత పాడేరులో దుకాణాల సంఖ్య కూడా పెరిగింది. రోడ్డు కిరువైపులా దుకాణాలతో ట్రాఫిక్ ప్రతిబంధకంగా మారింది. దీంతో, అధికారులు దీనిపై దృష్టి సారించి రోడ్ల విస్తరణకు పూనుకున్నారు.

ఇదిలా ఉండగా పాడేరు టౌన్ పరిధిలో అంబేద్కర్ జంక్షన్ నుంచి మూడు రోడ్లు విస్తరించేందుకు ఇదివరలో ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలు చాలా ఏళ్ల నుంచి కార్యరూపం దాల్చలేదు. ఈలోపు పాడేరు జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏడాది కాలం అయిపోయింది. కలెక్టరేట్ తో పాటు ఎస్పీ కార్యాలయం పాడేరు టౌన్ కు ఆ వైపున ఒకటి ఈవైపున ఒకటి ఏర్పాటు అయ్యాయి. కలెక్టరేట్ వచ్చినప్పటి నుంచి పాడేరు కు 22 మండలాల నుంచి వచ్చే సందర్శకుల తాకిడితోపాటు వాహనాల రద్దీ ఎక్కువైంది. దీనికి తోడు పాడేరులో మెడికల్ కళాశాల, పాడేరు నుంచి అరకు లోయకు వేస్తున్న హైవే రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ మామూలుగా లేదు. పాడేరు టౌన్ లో ఇప్పుడు మూడు ప్రధాన రోడ్ల విస్తరణ చేపట్టవలసిన అవసరం తప్పనిసరి అయింది. పాడేరు టౌన్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా ఆర్ అండ్ బి స్థలాల్లో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ఉన్న ప్రధానమైన మెయిన్ బజార్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, కాన్వెంట్ రోడ్డు, మూడువైపులా ఆక్రమణలు తొలగించే ప్రక్రియ మరో రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల తహసీల్దార్ వంజంగి త్రినాధరావు ప్రజాశక్తి కి తెలిపారు. ఆక్రమణలు తొలగింపులో సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తో పాటు సబ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ అండ్ బి, రెవెన్యూ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన జిసిసి హమాలీల సమ్మె

- మూడో రోజు వంటావార్పుతో నిరసన
- ఆందోళనకు సిఐటియు సంఘీభావం
- అరకులోయలో దీక్షకు కాంగ్రెస్ మద్దతు



చింతపల్లిలో ఆందోళన చేపడుతున్న హమాలీలు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సహకార సంస్థ (జిసిసి) లో పని చేస్తున్న హమాలీలు తమ సమ్మెలో భాగంగా గురువారం మధ్యాహ్నం పాడేరు జిసిసి కార్యాలయం ఆవరణలో దీక్షలు చేస్తున్న హమాలీలు వంటావార్పు కార్యక్రమంతో తమ నిరసన చేపట్టారు. పెరిగిన కూలి రేట్లకు సంబంధించి ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని గిరిజన సహకార సంస్థలో పని చేస్తున్న హమాలీలు చేపట్టిన సమ్మె మూడవ రోజు గురువారం కొనసాగింది. ఏజెన్సీ 11 మండలాల్లో ఉన్న జిసిసి బ్రాంచిలలో పని చేస్తున్న సుమారు 300 మంది హమాలీలు తమ విధులను బహిష్కరించి మూడు రోజులుగా మండల కేంద్రాల్లోని తమ జిసిసి గోడౌన్ల ప్రాంగణంలో సమ్మె నిర్వహిస్తున్నారు.

ఈ సమ్మెను ఉద్దేశించి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు మాట్లాడుతూ, సివిల్ సప్లై అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి హమాలీల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2022 జనవరిలో పెరిగిన ఎగుమతి, దిగుమతి కూలి క్వింటాకు రూ.3 పెంచినప్పటి నుండి నేటి వరకు బకాయి చెల్లించ లేదన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైందన్నారు. హమాలీలకు మూడు జతల బట్టలు పంపిణీ చేయాలని ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంబదిత అధికారులు బకాయి వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమస్యల పరిష్కారం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జిసిసి హమాలీల నాయకులు కుమార్, దేవుడు, గౌరి నాయుడు, భాస్కర్ రావు, బుజ్జి కార్మికులు పాల్గొన్నారు.



పాడేరులో వంటావార్పు చేపడుతున్న హమాలీలు

సిఐటియు అండ: చిన్నయ్యపడాల్

జిసిసి హమాలీల సమస్యల పరిష్కారానికి సివిల్ సప్లై కమిషనర్, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. గురువారం చింతపల్లి జిసిసి గోడౌన్ ఎదురుగా సమ్మె చేస్తున్న హమాలీలు (కళాసిల) వద్దకు సిఐటియు మండల కార్యదర్శి వేములపూడి రామకృష్ణతో కలిసి వెళ్లి మద్దతును ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హమాలీల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిఐటియు వెన్నుదన్నుగా ఉంటుందని, వారికి భరోసా కల్పించారు. 13 నెలలుగా బకాయి పడ్డ ఏరియర్స్‌ను విడుదల చేసి వెంటనే చెల్లించాలన్నారు. డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగించాలని హమాలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ఆవగడ్డ సత్తిబాబు, కోట వరప్రసాద్, కొరుప్రోలు అప్పలనాయుడు, రుత్తల అప్పలరాజు, డి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జిసిసి కార్యాలయం వద్ద హమాలీల దీక్ష మూడో రోజుకు చేరింది. ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్‌పర్సన్ పాచిపెంట శాంతకుమారి దీక్ష శిబిరంలో పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 13 నెలలుగా ఏరియర్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హమాలీలకు ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాంగి గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రాం పాల్గొన్నారు.

గీతం ఆసుపత్రిలో అత్యాధునిక కేథ్‌ల్యాబ్

జిమ్సర్ ఆసుపత్రిలో హృద్రోగులకు మెరుగైన సేవలు



క్యాథ్‌ల్యాబ్ ప్రారంభోత్సవంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి - మధురవాడ : నామమాత్రపు రుసుముతో సామాన్యులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (గీతం ఆసుపత్రి) తాజాగా హృద్రోగులకు అత్యాధునిక కేథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అన్ని రకాల గుండెజబ్బులకు చికిత్స అందించే విధంగా ఉత్తరాంధ్ర జిల్లాలో కోట్లాది రూపాయల వ్యయంతో గీతం వర్సిటీకి అనుబంధంగా ఉన్న జిమ్సర్ ఆసుపత్రిలో కేథరైజేషన్ ల్యాబోరేటరీని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ గురువారం, అపోలో ఆసుపత్రి కార్డియాలజీ విభాగం నిపుణులు డాక్టర్ బారువాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ గీతం బోధన ఆసుపత్రిలో పిజి వైద్య విద్యను అభ్యసించే వారికి అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతో పాటు సామాన్యుల గుండె జబ్బుల చికిత్సకు దూరప్రాంతాలకు వెళ్లనవసరం లేదన్నారు. జిమ్సర్ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలతో గుండె జబ్బులకు కూడా చికిత్స అందుతుందని స్పష్టం చేశారు. డాక్టర్ బారువా మాట్లాడుతూ గుండె జబ్బు రోగులు పెరుగుతున్న నేపథ్యంలో విశాఖలోని గీతం బోధన ఆసుపత్రిలో అత్యాధునిక కార్డియాలజీ విభాగాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, జిమ్సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, ప్రొఫెసర్ వై.గౌతమరావు, జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వివిఎల్ నరసింహరావు, జిమ్సర్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ, గీతం కార్డియాలజీ నిపుణులు డాక్టర్ గణేష్, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- భీమునిపట్నం : బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు సీతారాం అన్నారు. ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఐసిడిఎస్, డిసిపియు, రెవెన్యూ, పోలీస్, పంచాయితీరాజ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసిడిఎస్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిషేధ చట్టం -2006 పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజకీయనేతల ఒత్తిళ్లు, ప్రోద్బలంతో అత్యధిక శాతం బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు.

బాల్యవివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఎంపిపి డి వాసురాజు, తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, మహిళా సంరక్షణ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీదేవి, ఎస్ఐ భరత్‌కుమార్, ఎంఇఒ కెఎ బాలామణి పాల్గొన్నారుఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బాలల హక్కుల రక్షణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు సీతారాం ఎస్ఒఎస్ సిబ్బంది లక్ష్మణ్, సత్యనారాయణ పాల్గొన్నారు

పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీంలు గురువారం ఒక ప్రకటనలో సంయుక్తంగా కోరాయి. ఈ మేరకు విశాఖలోని ద్వారకానగర్‌లో బివికె.కాలేజీ ఎదురుగా ఉన్న పౌర గ్రంథాలయంలో ఈ నెల 29 సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపాయి. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నాయి.

స్థాయీ సంఘం సమావేశంలో అన్నీ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 47 అంశాలు, 15 టేబుల్ అంశాలు పొందుపరచగా అన్నీ ఆమోదం పొందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి దాదాపు రూ.661.08 లక్షల పనులకు ఆమోదం తెలిపినట్టు ఛైర్‌పర్సన్ తెలిపారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు పలు అంశాలను ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు డిసి (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, సింహాచలం, మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : రిటైర్ఉద్యోగస్తులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం పెదగంట్యాడ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగులకు రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలలోపు మాత్రమే పెన్షన్ వస్తోందని, దీంతో జీవనం కష్టమౌతోందన్నారు.ఈ నేపథ్యంలో విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వపరంగా పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంద్, పెదగంట్యాడ శాఖ అధ్యక్షులు కణితి అప్పలరాజు, ఎన్‌వి రమణ, ఎన్ నాయుడు, వెంకటరావు, అప్పలస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

మీటర్ రీడర్ల పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిఇపిడిసిఎల్ పరిధిలో స్పాట్ బిల్లింగ్ పనులు చేస్తున్న మీటర్ రీడర్ల పొట్టకొట్టొద్దని, సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఐదు జిల్లాల మీటర్ రీడర్ల సదస్సు డిమాండ్ చేసింది. తొలుత యూనియన్ గౌరవ అధ్యక్షులు జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడం లేదన్నారు. డోర్ లాక్, నాన్ స్కాన్ పేర్లతో జీతాల్లో కోతలు విధించడం అన్యాయమన్నారు. యూనియన్ విశాఖ జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఎపిఇపిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 1600 మంది మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాటను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎపిఐఎంఆర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ మాట్లాడుతూ ఎండనకా, వాననకా ఇంటింటికీ తిరుగుతూ సుమారు కోటీ 50 లక్షలకుపైగా సర్వీసులకు రీడింగులు తీస్తూ తాము జీవనం సాగిస్తున్నామన్నారు. స్పాట్ బిల్లింగ్ గడువు కుదింపు ప్రతిపాదనలను పున్ణపరిశీలించాలని సూచించారు. పని దినాలను కుదించడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రీడింగ్‌లు తీసే సర్వీసులు ఒక్కసారిగా సగానికి తగ్గిపోతాయని, ఫలితంగా ఆదాయం పడిపోతుందని తెలిపారు. తమకు నష్టం చేకూర్చే చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. సదస్సులో ఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కెఎస్‌డిఎస్‌కె.రెడ్డి, కోశాధికారి ఎమ్‌డి.సుభాన్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఆర్.కుమార్ స్వామి, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు డి.క్రాంతి కుమార్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పి.నాగబాబు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యకులు ఒ.శ్రీనివాసరావు, ఇతర డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విశాఖపట్నం-కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా వాల్తేరు డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జోడించాలని నిర్ణయించింది. 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలుకు జూన్ 02 నుండి 30 వరకు రోజు విడిచి రోజు అదనపు విస్టాడోమ్ కోచ్ జత చేయనున్నట్టు తెలిపింది. అదేవిధంగా 08552 కిరండూల్-విశాఖపట్నం రైలుకు జూన్ 3 నుంచి జూలై 1 వరకు రోజు విడిచి రోజు అదనపు విస్టాడోమ్ కోచ్ జతచేయనున్నట్టు తెలిపింది. కావున ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి కోరారు.

10 వేల జెడ్ఎస్ఇవిల విక్రయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ వ్యాప్తంగా 10 వేల జెడ్ఎస్ఇవి వాహనాలను విక్రయించినట్టు ఎంజి మోటార్ ఇండియా ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రారంభించినప్పటి నుంచి ఎంజెడ్ఎస్ఇవి భారతదేశపు మొట్టమొదటి స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ ఇంటర్నెట్ ఎస్‌యువిగా నిలిచిందన్నారు. ఇవి ఔత్సాహికులలో ప్రముఖ గ్రీన్ ప్లేట్‌గా మారిందని తెలిపారు. జెడ్ఎస్ఇవి ఆరు ఛార్జింగ్ ఎంపికలతో వస్తుందని తెలిపారు. ఇవి ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి భారతదేశం అంతటా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ధారాలమ్మ ఆలయం వద్ద నీటి ఇక్కట్లు

వసతి, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కరువే
అవస్థలు పడుతున్న వందలాది మంది భక్తులు
పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు



ధారాలమ్మ ఆలయం నీటికుండీ వద్ద నెలకొన్న అధ్వాన పరిస్థితిదీ..

ప్రజాశక్తి - సీలేరు: దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల దారాలమ్మ ఆలయం వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం అనేకమంది భక్తులు వచ్చే ఈ ఆలయం వద్ద మంచినీటి సౌకర్యంకల్పనలో నిర్లక్ష్యంతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వందలాది మంది భక్తులు వచ్చే ఆదివారం, ఇతర ఉత్సవాల రోజుల్లో భక్తుల కష్టాలు చెప్పనలవికాదు.

జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లో వెలసిన దారాలమ్మ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆంధ్ర, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. నిత్యం అధికసంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి ధన,వస్తురూపేణా కానుకలు సమర్పిస్తుండడంతో ఏటా రూ.20లక్షలకు పైబడి నగదు, బంగారం, వెండి ఆభరణాల రూపేణా ఆదాయం కూడా అధికంగానే ఉంటోంది.

ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ధారాలమ్మ ఆలయం వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో దేవాదాయశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా ఆలయం వద్ద మంచినీటికి కటకట తప్పడం లేదు. ఆదివారం రోజుల్లో మొక్కులు తీర్చుకునేందుకు అధికసంఖ్యలో వచ్చే భక్తులు, ఇక్కడ స్నానాలు అచరించి, శుచిగా అయిన తర్వాతే అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. అయితే ఆలయం వద్ద శిథిలావస్థకు చేరుకున్న నీటి కుండీలో అరకొరగా వచ్చిన నీటితో భక్తులు స్నానాలు చేయలేక, ఉండలేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడి నీటికష్టాలను గమనించిన ఒక భక్తుడు ఇటీవల విరాళంగా ఇచ్చిన సొమ్ముతో పాత నీటి కుండి సమీపంలోనే కొత్తగా మరో నీటి కుండీని నిర్మించారు. తద్వారా భక్తుల నీటి కష్టాలు కొంతమేర తీరాయి. అయితే గుంపులుగా వచ్చే కోతులు ఆ నీటి కుండీని అపరిశుభ్రం చేస్తుండడంతో కొత్త కుండీని మూసేశారు. దీంతో భక్తులకు ఆలయ ప్రాంగణంలో స్నానాలు చేయడానికి నీటి సమస్య ఏర్పడింది. అలాగే భక్తులకు వసతి సముదాయాలు, వంటశాల. మరుగుదొడ్ల వంటి సదుపాయాలు ఇక్కడ పూర్తిస్థాయిలో లేవు. పర్యాటకంగాను, ఆధ్యాత్మికంగానూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ధారాలమ్మ ఆలయాన్ని ప్రముఖ టాలీవుడ్ హీరో నందమూరి బాలకృష్ణ వంటి ప్రముఖులు కూడా దర్శనానికి వస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ధారాలమ్మ ఆలయం వద్ద భక్తులకు అవసరమైన అన్ని సౌకార్యలను కల్పించి, ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

జివిఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకట రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, యూనియన్ నాయకులపై అక్రమ బైండోవర్లు ఎత్తివేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపై అసత్య ఆరోపణలు, అక్రమ బైండోవర్లకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగారావు, కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జివిఎంసి పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్యం, క్లాప్ డ్రైవర్స్, పార్కులు, వెటర్నరీ, వాటర్ సప్లయ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే జివిఎంసి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కక్షపూరిత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ఎన్నడూలేని విధంగా నిర్బంధ చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. కేసులకు, నిర్బంధాలకు భయపడని యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డిపై పలు ఆరోపణలు చేస్తూ మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు పెట్టడమంటే కార్మిక ఉద్యమాలను అణిచివేయడమేనన్నారు. వెంకటరెడ్డి 50 ఏళ్ల నుండి బడుగు బలహీన వర్గాలు, అణగారిన కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. జివిఎంసిలో లక్షల రూపాయల లంచాలు తీసుకొని ఉద్యోగాలు వేస్తున్న వారి బండారం బయటపడుతుందనే ఉద్దేశ్యంతోనే వెంకటరెడ్డిపైనా, యూనియన్‌పైనా ఇటువంటి బురదజల్లే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు, నాయకులు ఎంవి.ప్రసాదరావు, వి.కృష్ణారావు పాల్గొన్నారు.



అప్పారావు పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అల్లం అప్పారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సీతమ్మధార : జెఎన్‌టియు మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం అప్పారావు పార్థివ దేహానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు నివాళ్లర్పించారు. నాలుగు రోజుల కిందట అమెరికాలో అప్పారావు మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గురువారం లాసన్స్ బే కాలనీలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మంత్రి అమర్‌నాథ్ అప్పారావు గృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యాపరంగా విశాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన అల్లం అప్పారావు మరణ వార్త విశాఖ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో లెక్చరర్‌గానీ, రీడర్‌గాగానీ పనిచేయకుండానే నేరుగా ప్రొఫెసర్ అయిన ఏకైక వ్యక్తి అల్లం అప్పారావు అని కొనియాడారు. కాకినాడ జెఎన్‌టియు ప్రప్రథమ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసి ఇంజినీరింగ్ విద్యలో అనేక కీలక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. అల్లం అప్పారావు వేలాదిమంది విద్యార్థులతో పిహెచ్‌డిలు చేయించి వారికి డాక్టరేట్లు వచ్చినట్టుగా చేసి, ఆయన కూడా డాక్టరేట్ సాధించారని తెలిపారు. అల్లం అప్పారావు పార్థివ దేహం వద్ద మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నివాళ్లర్పించారు. అవంతి కళాశాలలకు అప్పారావు అనేక సూచనలు అందించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వాటిపై ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడిన సంఘటన మండల కేంద్రం కొయ్యూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని మంప గ్రామానికి చెందిన అల్లు శివ, గాడి కుమార్‌రాజా, దాసరి బాబీ రాయల్ ఇన్ఫీల్డ్ వాహనంపైనా, తుమ్మలబంధ గ్రామానికి చెందిన ఉల్లి గంగరాజు, వీరమణి దంపతులు హోండా బైక్‌పైనా ఎదురెదురుగా వస్తున్నారు. కొయ్యూరు సమీపానికి వచ్చే సరికి హోండో బైక్‌ను రాయల్ ఇన్ఫీల్డ్ బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో హోండా బైక్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ఇద్దరు ఎగిరి పొలాల్లో పడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులకు కొద్దిపాటి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను రాజేంద్ర పాలెం పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వారిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఎంపిపి రమేష్ పరామర్శించారు. మద్యం సేవించి ఉండటం, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

డిఎంయు ఆపరేటర్లకు ఐరిష్ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో చేతి వేలి ముద్రలు పడని వృద్ధులు, అనారోగ్య పీడితులు, కొంతమంది గృహనిర్మాణ కార్మికులకు రేషన్ జారీ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండియు ఆపరేటర్లకు గురువారం ఐరిష్ పరికరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుపై ఎండియు వాహనాల వద్ద రేషన్ సరుకులు తీసుకోవడానికి వెళ్తున్న అనేకమందికి వేలిముద్రలు పడటం లేదని, దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ సమస్య పరిష్కారానికి ఐరిష్ పరికరాలను అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని 310 ఎండియు ఆపరేటర్లకు వీటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ డిఎస్ఒ పాల్గొన్నారు.